**విలేఖరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభా' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

ఫోన్ - 8985829417



# సూర్య ప్రభా

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 2 సంచిక: 3 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | శనివారం, జూన్ 28 2025 | పేజీలు : 4







# ఖయ్యానికి కాలుదువ్వుతున్నారా!?

## భారత్‌పై భారీ కుట్రకు సిద్ధమవుతున్న పాక్..?

## ధ్వంసమైన ఉగ్ర శిబిరాల పునర్నిర్మాణం..?

పహల్గామ్ దాడి తర్వాత తీవ్రంగా నష్టపోయిన పాకిస్థాన్ తన బుద్ధిని మాత్రం మార్చుకోవడం లేదు. పాక్ మరోసారి భారతదేశంపై పెద్ద కుట్రకు పాల్పడుతోందని తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా దాయాది దేశంలో ధ్వంసమైన ఉగ్రవాద లాంచింగ్ ప్యాడ్‌లు, శిక్షణా కేంద్రాలను పునర్నిర్మిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ముఖ్యంగా పీవోకే లోని దట్టమైన అడవుల్లో ఈ కార్యకలాపాలు కనిపిస్తున్నాయని ఓ జాతీయ మీడియా సంస్థ కథనం వెల్లడించింది. నివేదిక ప్రకారం.. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆదేశ సైన్యం, ప్రభుత్వం ఈ ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రత్యక్షంగా మద్దతు ఇస్తున్నాయి. ఇటీవల బహవల్పూర్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ శిబిరాలను తిరిగి స్థాపించాలని నిర్ణయించారు. జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్, టీఆర్ఎఫ్ వంటి ఉగ్రవాద సంస్థల అగ్ర కమాండర్లతో పాటు పాక్ సైన్యం, ఐఎస్ఐ సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. నిఘా సంస్థల సమాచారం ప్రకారం.. ఈసారి ఉగ్రవాద శిబిరాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలు అమర్చనున్నారు. తద్వారా భారత నిఘా సంస్థలు వాటిని చేరుకోవడం కష్ట తరంగా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. ఈ శిబిరాల భద్రతా బాధ్యతను పాకిస్థాన్ సైన్యంలోని ప్రత్యేక భద్రతా గార్డులకు అప్పగించారు. వారు డ్రోన్లు, థర్మల్ సెన్సార్లు, నైట్ విజన్ కెమెరాలు వంటి ఆధునిక సాంకేతిక పరికరాల సహాయంతో ఈ ప్రాంతాలను పర్యవేక్షిస్తారు. ఈసారి ఉగ్రవాద సంస్థలు తమ వ్యూహాన్ని మార్చుకున్నాయి.

ఇప్పుడు ఒక శిబిరంలో 200 కంటే తక్కువ మంది ఉగ్రవాదులను ఉంచుతారట. భారతీయ ఏజెన్సీలకు ట్రాక్ చేయడం కష్టతరం అయ్యేలా అనేక చిన్న శిబిరాలను నిర్మిస్తున్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే, ఉగ్రవాదులను వెంటనే సరిహద్దు వైపు పంపుతారు. ఈ సమాచారం అందిన తర్వాత, భారత భద్రతా సంస్థలు నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) సమీపంలో కార్యకలాపాలపై తమ పర్యవేక్షణను మరింత ముమ్మరం చేశాయి. సైన్యం, నిఘా సంస్థలు హై అలర్ట్ జారీ చేశాయి. పీఓకేలో ఈ స్థావరాలను తిరిగి ఏర్పాటు చేస్తున్న వారిపై ఉపగ్రహ చిత్రాలు, గ్రౌండ్ ఇంటెలిజెన్స్ ద్వారా నిఘా పెంచారు. కాగా.. ఆపరేషన్ సింధూర్ కింద భారత భద్రతా సంస్థలు పాకిస్థాన్‌లోని అనేక ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేశాయి.

వాటిలో లూని, పుత్వాల్, భైరోనాథ్, పిపి ధన్‌ధర్, టిప్పు, ముంతాజ్ కాంప్లెక్స్, జమీల్, సైధ్వాలి, ఉమ్రాన్‌వాలి బంకర్, చాప్రార్ ఫార్వర్డ్, చోటా చక్ పోస్ట్, అఫ్జల్ షహీద్ పోస్ట్, జంగ్లోరా పోస్ట్ ఉన్నాయి. కానీ ఇప్పుడు ఈ ప్రదేశాలన్నింటిలోనూ వాటిని కొత్త మార్గాల్లో తిరిగి సిద్ధం చేసే కసరత్తు ప్రారంభమైంది.

# దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన పీవీ : సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: మాజీ ప్రధానమంత్రి, బహుభాషా కోవిదుడు, రచయిత, ఆర్థిక సంస్కరణల పితామహుడు, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయనను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. ప్రధానిగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడంలోనూ, అన్ని రంగాల్లో ఆర్థిక సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత పీవీ నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ(శుక్రవారం) ఓ ప్రకటన విడుదల చేశారు. నాడు పీవీ చేపట్టిన ఆర్థిక సంస్కరణలే నేడు భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు దోహదపడుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. విద్యా వ్యవస్థలో వినూత్న విధానాలు ప్రవేశ పెట్టారని, నవోదయ విద్యాలయాలు పీవీ హయాంలోనే ఏర్పాటు చేశారని గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా సర్వేల్ రెసిడెన్షియల్ స్కూల్ నెలకొల్పి గురుకుల విద్యకు తొలి అడుగులు వేశారని ఉద్ఘాటించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. పీవీ స్ఫూర్తితోనే రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

రాష్ట్రంలో గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం సంకల్పించిందని వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# హుస్నాబాద్ అభివృద్ధిపై మంత్రుల కీలక వ్యాఖ్యలు

సిద్దిపేట: హుస్నాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని.. ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. అక్కన్నపేట నుంచి జనగాం వరకు నాలుగు లైన్‌ల రోడ్డు త్వరలోనే వస్తుందని అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ హుస్నాబాద్ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, ఇంజనీరింగ్ కాలేజ్, టూరిజ్ ప్రాజెక్ట్‌లు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇవాళ హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం భారీ బహిరంగ సభలో మంత్రులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు.

**హుస్నాబాద్ ప్రజల గౌరవాన్ని పెంచుతా: మంత్రి పొన్నం ప్రభాకర్ :** 'రెండు సంవత్సరాల కింద ఇదే వేదిక మీద బడిపండగ జరిగింది. అప్పుడు ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలో లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు , కేబినెట్ మంత్రుల సహకారంతో శాతవాహన యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజ్ తరగతులు




ఈ సంవత్సరం నుంచి ప్రారంభం అవుతున్నాయి. రూ.82.00 కోట్లతో 150 పడకల ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేశాం. రూ.77.20 కోట్లతో రాజీవ్ రహదారి కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు రెండు వరుసల రహదారుల నుంచి నాలుగు వరుసల రహదారికి ఫేజ్ 2కు శంకుస్థాపన చేశాం. నూతనంగా రూ.11.50 కోట్లతో నిర్మించిన 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాం. ఫేజ్ - 1 త్వరలోనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశాం. గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల పనులు జరుగుతున్నాయి. నన్ను గెలిపించిన హుస్నాబాద్ ప్రజల గౌరవాన్ని పెంచుతా. హుస్నాబాద్‌ని అభివృద్ధి అన్నిరంగాల్లో ముందుంచుతా. ఇక్కడికి వచ్చిన మంత్రులు హుస్నాబాద్ అభివృద్ధికి అభయం ఇవ్వాలి. కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వంలో పంట పెట్టుబడి సహాయం, ఇందిరమ్మ ఇళ్లు, సన్నవడ్లకు రూ.500 బోనస్ ,రుణమాఫీ, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం ఇలా ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం' అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.




# అప్పుడే మొదలైన జూబ్లీహిల్స్...

# ఉప ఎన్నిక వేడి..!

## కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న ముగ్గురు నేతలు

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో తెలంగాణలో మరో ఉప ఎన్నిక రాబోతుంది. ఆరు నెలల్లో బైపోల్ రావాల్సి ఉన్నా..రెండు మూడు నెలల్లోపే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందంటున్నారు. దీంతో ఇప్పటి నుంచే మూడు ప్రధాన పార్టీలు జూబ్లీహిల్స్ సీటును కైవసం చేసుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నాయి. ముఖ్యంగా కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ సిట్టింగ్ సీటును గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే సీటును కూడా కైవసం చేసుకోవాలనే గట్టి పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. మరో వంక బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. ముఖ్యంగా.. వరసగా మూడుసార్లు అదే నియోజకవర్గం నుంచి గెలిచిన మాగంటితో పార్టీకి, పార్టీ కంటే మిన్నగా, పార్టీ అధినేత కేసీఆర్‌కు ఉన్న అనుబంధం దృష్ట్యా..నియోజకవర్గంలో మాగంటి పేరు నిలిచేలా గెలిచి తీరాలని గులాబీ బాస్ వ్యూహ రచన చేస్తున్నట్లు చెపుతున్నారు. మాగంటి కుటుంబం నుంచి ఎవరినైనా బరిలోకి దించుతారా లేదా అన్నది ఇంకా స్పష్టత లేదు. వారి కుటుంబం నుంచి పోటీకి ఎవరూ సుముఖంగా లేకపోతే..మరో నేతను పోటీలో పెట్టనున్నారు. పీజేఆర్ కుమారుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ ఇస్తుందన్న ప్రచారం జరుగుతోంది. ఆయనకు దాదాపు కన్ఫామ్ చేశారని అంటున్నారు. ఇక గతంలో జూబ్లీహిల్స్ నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన రావుల శ్రీధర్‌రెడ్డి ఇప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్నారు. ఆయన కూడా టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

**టికెట్లు ఆశిస్తున్నది వీరే?...** ఇక అధికార కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారుతోందట. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అజారుద్దీన్ మళ్లీ టికెట్ ఇవ్వాలని కోరుతున్నారట. ఆయనతో పాటు చిన్న శ్రీశైలం యాదవ్ కుమారుడు కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్ కూడా ఈసారిలో బరిలో నిలవాలని ప్లాన్ చేస్తున్నారట. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిధిలో నవీన్ యాదవ్‌కు మంచి పట్టుంది. 2014 ఎన్నికలలో నవీన్ యాదవ్‌మజ్లిస్ పార్టీ నుంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి 41వేల 656 ఓట్లు సాధించారు. 2018లో AIMIMకు రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికలలో పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 18వేల 817 ఓట్లు పడ్డాయి. ఇక పీజేఆర్ కూతురు, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి కూడా కాంగ్రెస్ నుంచి జూబ్లీహిల్స్ టికెట్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఓ రెడ్డి, ఇంకోవైపు బీసీ, మరోవైపు మైనార్టీ ఈక్వేషన్‌లో హస్తం పార్టీకి ఎవరికి టికెట్ కేటాయిస్తుందనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లిం, మైనార్టీ ఓటర్లు డిసైడింగ్ ఫ్యాక్టర్స్‌గా ఉన్నాయి. ఈనేపథ్యంలో ఎంఐఎం సపోర్ట్ ఎవరికన్నది కూడా చర్చనీయాంశం అవుతోంది. ఇక బీజేపీ విషయానికి వస్తే..ఏపీలో విజయవంతమైన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రయోగాన్ని తెలంగాణాలో పరీక్షించుకునేందుకు ఇదొక అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి మాగంటి గోపీనాథ్ టీడీపీ ప్రొడక్ట్. రాష్ట్ర విభజన తర్వాత 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన టీడీపీ టికెట్ పైనే గెలిచారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిస్థితులతో 2016లో బీఆర్ఎస్‌లో చేరి వరుసగా 2018, 2023 ఎన్నికల్లో విజయ సాధించారు. అయినా..టీడీపీతో, ముఖ్యంగా చంద్రబాబుతో ఆయనకు చివరి వరకు మంచి సంబంధాలున్నాయి. అందుకే.. మాగంటి చనిపోయినప్పుడు లోకేష్ దంపతులు మాగంటి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అయితే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున అభ్యర్థిని నిలబెట్టాలన్న యోజనలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఉన్నారని తెలుస్తోంది. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన దీపక్‌రెడ్డి..బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో కలిసి విజయవాడలో ఏపీ సీఎం చంద్రబాబును కలిశారు. ఆ సమావేశంలో జూబ్లీహిల్స్ బైపోల్‌పై చర్చించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రాంతాల వారుండే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఈసారి పార్టీల వ్యూహాలు, ఫలితాలు ఎలా ఉండబోతున్నాయనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది.

## ఆమెకు రక్తం కావాలి..!

నల్గొండ : సాధారణంగా మహిళల్లో 14 శాతానికి మించి హిమోగ్లోబిన్ ఉంటే ఆరోగ్యకరంగా ఉన్నట్లని డబ్ల్యూహెచ్‌వో లెక్కలు చెబుతున్నాయి. కానీ జిల్లాలో ఉన్న 8.25 లక్షల మంది మహిళల్లో 50 నుంచి 60 శాతం మంది మహిళలు హెచ్‌బీ (హిమోగ్లోబిన్) 14 శాతం కంటే తక్కువతో బాధపడుతున్నారు. ప్రసవంతో పాటు ఇతర శస్త్రచికిత్సల కోసం కేవలం జనరల్ ఆసుపత్రి మాతాశిశు సంరక్షణ కేంద్రంలోనే రోజుకు 25 నుంచి 30 మంది చేరుతున్నారు. వీరిలో 20 మంది వరకు మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో పాటు నెలసరి రుతుక్రమం మూలంగా ఎక్కువ శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు.

జిల్లా కేంద్రం పరిధిలోని గిరకబాయిగూడెం ప్రాంతానికి చెందిన సౌమ్య(28) ఇంట్లో రోజూవారీ పనులు చేస్తూ వారం క్రితం కింద పడిపోయింది. కారణం తెలియని భర్త వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమెలో కేవలం 4 శాతం మాత్రమే రక్తం ఉందని, తక్షణం రక్తం ఎక్కించాలని సూచించారు.

జిల్లా కేంద్రానికి ప్రసవం కోసం వస్తున్న మహిళల్లో 60 శాతం మందికి రక్తం తక్కువగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. శస్త్రచికిత్స సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని.. అందుకే ముందుగా రక్తం అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వారికి సూచిస్తున్నారు. కారణం ఏదైనా ఇలా నిత్యం రక్తం కోసం వెతుకులాడే వారిలో ఎక్కువ శాతం మంది మహిళలే ఉంటున్నారు.

జంక్‌ఫుడ్ వదిలేయాలి: డా.స్వరూపారాణి, గైనిక్ హెచ్‌వోడి, ఎంసీహెచ్ నల్గొండ

జనరల్ ఆసుపత్రికి శస్త్రచికిత్సల కోసం వచ్చే మహిళల్లో 50 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. పురుషులతో పోల్చితే స్త్రీలకు నెలసరి, ప్రసవం కారణంగా రక్తం తక్కువగా ఉంటుంది. దీనికి తోడు ఎక్కువ మంది జంక్‌ఫుడ్ తీసుకోవడం, కారం ఎక్కువగా తినడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఐరన్ మాత్రలతో పాటు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. గుడ్లు, రోజుకు తగినంత నీరు, బెల్లం ఎక్కువగా ఉండే పదార్థాలు, రాగులు, ములక్కాయలు, పప్పు, కూరగాయలు, పండ్లు, మాంసాహారం తీసుకోవడంతో రక్తం ఎక్కువగా వస్తుంది. వైద్యఆరోగ్యశాఖ అధికారులతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తహీనతతో బాధపడేవారికి పూర్తి స్థాయిల్లో అవగాహన కల్పిస్తున్నాం.

## నెమ్మదిగా.. సాగుతున్న దిద్దుబాట..!

చౌటుప్పల్ : హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై అత్యంత ప్రమాదకర ప్రాంతాల్లో(బ్లాక్ స్పాట్స్) పనులు సాగుతున్నాయి. గతేడాది జూన్‌లో తరచూ ప్రమాదాలు జరిగే 17 ప్రాంతాల్లో పనులను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో ఒక ఫ్లైఓవర్, 13 అండర్‌పాస్ వంతెనలు, 10 చోట్ల సర్వీసు రోడ్డు నిర్మాణాలను చేపడుతున్నారు. 16 బ్లాక్ స్పాట్లు ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఉండటం గమనార్హం. మరో బ్లాక్ స్పాట్ ప్రాంతం ఏపీలోని నవాబుపేట వద్ద ఉంది. ఇప్పటికి సగం ప్రాంతాల్లో పనుల్లో వేగం పుంజుకోలేదు. ఈ పనులను హరియాణాకు చెందిన సంస్థ చేపడుతుంది. చౌటుప్పల్‌లో పరిస్థితి మరి దారుణంగా ఉంది. డ్రైనేజి, సర్వీసు రోడ్డు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. తంగడపల్లి రోడ్డు నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు, మీసేవా నుంచి ఆర్డీవో కార్యాలయం వెళ్లే దారి వరకు కంకర వేసి బీటీ వేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లినప్పుడు కంకర ఎగిరి ప్రజలకు తగులుతుంది. టైర్లు కూడా పంక్చర్ అవుతున్నాయని చోదకులు తెలుపుతున్నారు.

**చౌటుప్పల్ నుంచి కోదాడ సరిహద్దు వరకు..**

చౌటుప్పల్ బస్టాండు నుంచి చిన్నకొండూరు రోడ్డు వరకు 150 మీటర్లు ఫ్లైఓవర్ వస్తుంది. మిగతాది మట్టి కట్ట(వెహికల్ అండర్ పాస్)ను నిర్మిస్తారు. పెద్దకాపర్తి, చిట్యాల, కట్టంగూరు జంక్షన్(నల్గొండ రోడ్డు), ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట ఎస్వీకళాశాల– జనగాం కూడలి, జమ్మిగడ్డ కూడలి, దురాజ్‌పల్లి, ముకుందాపురం యూటర్న్ మునగాల, కోమరబండ, కోదాడ, మేళ్లచెర్వు పైవంతెన శ్రీరంగాపురం వద్ద అండర్ పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు కూడా నత్తనడకన నడుస్తున్నాయి. ఏడాదిన్నర కాలంలో పనులను పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐ గుత్తేదారు సంస్థను ఆరంభంలోనే ఆదేశించింది. మరో నెల రోజులు గడిస్తే వర్షాలు కురిసే అవకాశముంది. పనులకు ఆటంకం కలగనుంది. వేసవిలో కూడా పనులు వేగంగా చేయకపోతే మరో ఏడాదికి పైగా సమయం పట్టనుంది. చౌటుప్పల్‌లో ఫ్లైఓవర్, అండర్‌పాస్ పనుల ప్రారంభానికి ఇంకా రెండు నెలలకు పైగా సమయం పట్టే అవకాశముంది. అడ్డుగా అక్రమ నిర్మాణాలు.. దూడల భిక్షంగౌడ్, భాజపా మునుగోడు అసెంబ్లీ కన్వీనర్

చౌటుప్పల్‌లో సర్వీసు రోడ్డు, అండర్‌పాస్ నిర్మాణాలకు అడ్డుగా పలు అక్రమ నిర్మాణాలున్నాయి. వీటిని అధికారులు తొలగించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. పనుల్లో జాప్యానికి కూడా ఇవి కారణంగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం పనులను చేపడుతుంటే పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

వేగం పెంచుతాం.. నాగేశ్వర్‌రావు, ఎన్‌హెచ్–65 ప్రాజెక్ట్ డైరెక్టర్

బ్లాక్‌స్పాట్స్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. పెద్దకాపర్తి, చిట్యాలలో అండర్ పాస్ పనులను 50శాతానికి పైగా పూర్తయ్యాయి. తొలుత సర్వీసు రోడ్లు, భూగర్భ మురికి కాల్వ పనులు పూర్తి కావాలి. అండర్ పాస్ పనులకు గోతులు తవ్వి ఫిల్లర్లు నిర్మిస్తాం. ఆ తర్వాత గడ్డర్స్, ప్రికాస్ట్ వాల్స్ అమర్చి మట్టిని నింపుతాం. ఈ పనులు రెండు నెలల్లోనే పూర్తి అవుతాయి. ఇప్పటికే గుత్తేదారు గడ్డర్స్, ప్రికాస్ట్ వాల్స్ సిద్ధం చేసి పెట్టారు. నిర్మాణ పనుల్లో కూడా వేగం పెంచాలని గుత్తేదారుకు సూచిస్తాం.

## భగీరథుడి తీరు.. నిమ్మకు నీరు..!

చిట్యాల : ఏళ్లుగా పెంచుతున్న నిమ్మతోటలను నీటి కొరత నుంచి కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి అవి ఆగి.. ఆగి పోస్తున్న నీటిని బొట్టుబొట్టుగా ఒడిసిపట్టుకుని తోటలను కాపాడుకుంటున్నారు. నకిరేకల్ ఉద్యాన క్లస్టర్ పరిధిలోని పలు గ్రామాల్లో నిమ్మ రైతులు, కూరగాయల పెంపకం రైతులు కరవు పరిస్థితుల్లో తోటలను రక్షించుకునేందుకు నీటి గుంతలను నిర్మించుకుంటున్నారు. చిట్యాలలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు నారబోయిన నర్సింహకు ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో మూడు ఎకరాల్లో నిమ్మతోట ఉంది. ఆయన ఇప్పటి వరకు 20 ఏళ్లలో 36 బోర్లు వేశారు. అందులో ఒండు బోర్లు మాత్రమే ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం అవి రెండు కూడా ఆగి..ఆగి పోస్తున్నాయి. ఈ నీటిని డ్రిప్‌ద్వారా చెట్లకు పెట్టడం సాధ్యం కావడం లేదు. దీంతో రూ.1.50 లక్షల వ్యయంతో తోటలో 20 అడుగుల లోతు, 30 అడుగుల పొడవు, వెడల్పులతో నీటి గుంతను నిర్మించి పాలిథీన్ షీట్ ఏర్పాటు చేశారు. రెండు బోర్ల నుంచి అరకొరగా వస్తున్న నీటిని ఈ గుంతలో నిల్వ చేసి ఒకేసారి ఒత్తిడితో డ్రిప్ ద్వారా నిమ్మచెట్లకు నీటిని పెట్టి కాపాడుతున్నారు. నేరడ గ్రామానికి చెందిన మరో రైతు సీహెచ్.వెంకన్న రూ.2లక్షలతో పాలిథీన్ షీట్ గుంతను నిర్మించారు. నీటిని నిల్వ చేసి నిమ్మచెట్లను బతికించుకుంటున్నానని వివరించారు. మండలంలో భారీ వర్షాలు వచ్చినపుడు చుట్టుపక్కల ఉన్న చెరువుల్లో నీరు చేరినప్పుడు మాత్రమే బోర్లు ఎక్కువ పోస్తున్నాయని, నీటి వసతులు లేక ఇక్కడ కరవు పరిస్థితి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సారెగూడెం బంగారు మైసమ్మ 6వ వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ..







కుత్బుల్లాపూర్ (సూర్యప్రభా)కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని డి.పోచంపల్లి మున్సిపాలిటీ, సారెగూడెంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ శ్రీ శ్రీ బంగారు మైసమ్మ దేవస్థానం 6వ వార్షికోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు..అనంతరం వేదపండితుల ఆశీర్వచనల మధ్య ఆలయ కమిటీ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో సత్కరించారు..ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాసరెడ్డి, డి.పోచంపల్లి మాజీ కౌన్సిలర్ యం.రాము గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు నాగరాజు, సదానందం, యాదగిరి, మచ్చేందర్ రావు, కొల్తూరు మల్లేష్, శంకర్, రాజు, కె శ్రీశైలం, లక్ష్మీనారాయణ గార్లతో పాటు తదితరులు పాల్గొన్నారు..

## అతిథి బిర్యానీస్ ఫుల్లవ్స్ హెూటల్ ను ప్రారంభించిన నియోజకవర్గ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి





కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా) నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ కాకతీయ హిల్స్ వాసులు రమణ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసుకున్న అతిథి బిర్యానీస్ %ఽ% ఫుల్లవ్స్ హెూటల్ ను ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి మరియు చైర్మన్, తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ గుత్తా అమిత్ రెడ్డి . ఈ కార్యక్రమ ంలో ఎన్ ఎం సి అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఓబీసీ శాఖ కన్వీనర్ షేక్ బిక్కన్ షా, మహిళ కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రటరీ షేక్ రఫీయాబేగమ్, జనరల్ సెక్రటరీ కోలన్ జీవన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వీరబాబు, మధ్య నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, బి భాస్కర్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, మురళీకృష్ణ , ఆదిరెడ్డి, ప్రశాంత్ రెడ్డి, తులసీదాస్, బండ్ల విజయ్ కుమార్, రవీందర్ రెడ్డి, సందీప్ రెడ్డి, నవీన్ రెడ్డి, ఏవి రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## అజీజ్‌నగర్‌లో సమీకృత మార్కెట్



హైదరాబాద్ : కూరగాయలు, పూల హెూల్‌సేల్ మార్కెట్ అంటే ముందుగా గుర్తుకొచ్చేది గుడిమల్కాపూరే. దీనిని తరలించాలని కొంతకాలంగా ఉన్న ప్రతిపాదనలు త్వరలో కార్యరూపం దాల్చనున్నాయి. నగర శివారు అజీజ్‌నగర్‌లో అన్ని సదుపాయాలతో మార్కెట్‌ను ఏర్పాటు చేయడానికి కసరత్తు మొదలైంది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మార్కెట్ కోసం స్థల సేకరణ పూర్తి చేశారు. కూరగాయలు, పూలతోపాటు పండ్ల మార్కెట్‌ను కలిపి సమీకృత (ఇంటిగ్రేటెడ్) మార్కెట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం సుమారు 150 ఎకరాల స్థలసేకరణ చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపించినట్లు తెలిసింది.

మెహదీపట్నానికి సమీపంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది. నగరం అభివృద్ధి చెందడంతో ఈ ప్రాంతం ప్రస్తుతం రద్దీగా మారింది. దీన్ని తరలించడానికి శంకర్‌పల్లి, శంషాబాద్, మొయినాబాద్, గండిపేట మండలాల్లో ప్రభుత్వ భూములను పరిశీలించారు. బాహ్యవలయ (అవుటర్ రింగు రోడ్డు) రహదారికి సమీపంలోని మొయినాబాద్ మున్సిపాలిటీ అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు అనువుగా ఉన్నాయని, ఇక్కడైతేనే రైతులు, హెూల్‌సేల్ వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే నంబరు 176లో సుమారు 220 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇందులో 150 ఎకరాల్లో సమీకృత మార్కెట్‌ను నిర్మించాలని ప్రభుత్వ ప్రతిపాదన. ఇప్పటికే భూముల వివరాలు కలెక్టర్‌కు అందగా.. దస్త్రం ప్రభుత్వానికి చేరింది.

**రైతులకు అనువుగా**అజీజ్‌నగర్‌లో పూలు, పండ్లు, కూరగాయల మార్కెట్ అందుబాటులోకి వస్తే పశ్చిమ రంగారెడ్డి ప్రాంతాలైన వికారాబాద్, కొడంగల్, తాండూరు, పరిగి, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, సంగారెడ్డి, మెదక్ జిల్లాల రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు ప్రతిపాదించారు.

ఈ ప్రాంతం అవుటర్ రింగు రోడ్డుకు పక్కనే ఉండటంతో రవాణా సౌకర్యంగా ఉంటుంది. శివారు జిల్లాల నుంచి తాజా కూరగాయలు సైతం మార్కెట్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అత్యాధునిక సౌకర్యాలు కల్పించడమేకాకుండా.. పార్కింగ్ సమస్య తలెత్తకుండా 150 ఎకరాల్లో మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

## రెండేళ్లు దిగులు.. ఆపై మిగులు

హైదరాబాద్ : మహానగరంలో మరో రెండేళ్ల పాటు తాగునీటి లోటు ఉండనుంది. ఐదేళ్లుగా డిమాండు, సరఫరా మధ్య అంతరం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుత తాగునీటి పరిస్థితి, 2030 వరకు అవసరాలు తీర్చేందుకు చేపట్టాల్సిన చర్యలను జలమండలి విశ్లేషించింది. 2020లో సుమారు 40 ఎంజీడీ(మిలియన్ గ్యాలన్స్ ఫర్ డే)ల అంతరం ఉండగా.. ఇప్పుడది 100 ఎంజీడీలకు పైగా పెరిగింది.

2027 నాటికి అంతరం 260 ఎంజీడీలకు పెరిగే అవకాశం ఉందని అంచనా. అప్పటికల్లా గోదావరి 2, 3 దశలు పూర్తయితే 301 ఎంజీడీ(17.5 టీఎంసీలు)ల నీటితో నగరం అవసరాలు పూర్తిగా తీరడమే కాకుండా 34 ఎంజీడీల మిగులు ఉంటుందని జలమండలి భావిస్తోంది.ప్రస్తుతం జలమండలి ఓఆర్ఆర్ వరకు తాగు నీటిని సరఫరా చేస్తోంది. ఇప్పటికే నీటి కనెక్షన్ల సంఖ్య 14.07 లక్షలకు చేరుకుంది. కొత్త ప్రాంతాల్లో నిర్మాణాలు జోరుగా సాగుతుండటంతో డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. ప్రతి నెలా సగటున 3వేల కొత్త కనెక్షన్లు ఇస్తుండటమే ఇందుకు నిదర్శనం.

**జలాలపై ప్రత్యేక దృష్టి..** రంగారెడ్డి జిల్లాలో ఏడు మండలాల్లో 56 గ్రామాల పరిధిలో 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంది. అక్కడ భారీగా నీటి అవసరం ఉంది. అందుకే అదనంగా జలాలు తీసుకురావడంపై దృష్టిసారించారు. నివాసాలు, వాణిజ్య, పారిశ్రామిక సముదాయాలు, వినోద విభాగాలు సహా ఏఐ, ఫిన్‌టెక్, స్మార్ట్ టెక్నాలజీల ఇన్నోవేషన్ హబ్‌లు అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. నగరంలోని ఇతర ప్రాంతాల వాణిజ్య పారిశ్రామిక అవసరాలు, గేటెడ్ కమ్యూనిటీలు, రైల్వేలు, ఐటీ హబ్‌లు, సెజ్‌లకు 2027 నాటికి మొత్తం 100 ఎంజీడీల నీరు అదనంగా అవసరమని అంచనా. గోదావరి 2, 3 దశలతో అదనపు జలాలను అందుబాటులోకి తీసుకురావడం, వృథా తగ్గించటం, తాగటానికి కాకుండా ఇతర అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటి వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణతో ముందు కెళ్లాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు.

## అతివల హితం.. నగదు రహితం

పెద్దపల్లి : పెద్దపల్లి మండలం కాపులపల్లిలోని స్వశక్తి సంఘాల మహిళలు ప్రతి నెలా చెల్లించాల్సిన పొదుపు, రుణ వాయిదాల డబ్బును వినియోగదారుల సేవా కేంద్రం (సీఎస్‌సీ) నిర్వాహకురాలికి అప్పగించారు. ఆమె సంఘాల ఖాతాల్లో జమ చేయలేదు. తర్వాత గుర్తించిన సభ్యురాళ్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

చిగురుమామిడి మండలం లంబాడిపల్లిలో స్వశక్తి మహిళలు నెలవారీ వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించారు. అయితే నేరుగా బ్యాంకుకు వెళ్లకుండా వీవోఏ (గ్రామైక్య సంఘం) ప్రతినిధులకు ఇచ్చారు. వారు ఖాతాల్లో జమ చేయకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు చిరు వ్యాపారాలు, చిన్న తరహా పరిశ్రమలతో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు అందుబాటులో లేకపోవడంతో పొదుపు సొమ్ము, రుణ కిస్తీల చెల్లింపులో ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ క్రమంలో మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని బ్యాంకులో



జమ చేయకుండా డబ్బు కాజేస్తున్నారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సెర్ప్ కార్యాచరణ చేపట్టింది. జిల్లాకు ఒక మండలంలో ప్రయోగాత్మకంగా నగదు రహిత లావాదేవీలపై అతివలకు అవగాహన కల్పించేందుకు సన్నద్ధమవుతోంది.

**పక్కదారి పడుతున్న పొదుపు సొమ్ము**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 42,504 సంఘాల్లో సుమారు 5 లక్షల మందికి పైగా సభ్యులున్నారు. ఈ ఏడాది రూ.2,555.15 కోట్ల రుణ లక్ష్యం విధించారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు లేకపోవడంతో మహిళలు స్థానిక సీఎస్‌సీ కేంద్రాలు, వీవోఏలు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు ఇచ్చిన రుణ కిస్తీ డబ్బులు పక్కదారి పడుతున్నాయి. ఖాతాలో జమ కాలేదని గుర్తించిన తర్వాత బాధితులు ప్రశ్నించినా బాధ్యులు చేతులెత్తేస్తుండటంతో రూ.లక్షల్లో నష్టపోతున్నారు.

**ఇదీ ప్రణాళిక..**

ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని నగదు రహిత లావాదేవీల అమలుకు ప్రయోగాత్మకంగా ఎంపిక చేస్తారు.

రుణ కిస్తీ, పొదుపు డబ్బులను బ్యాంకులో జమ చేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పిస్తారు.

ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతర ఆన్‌లైన్ లావాదేవీలపై సభ్యుల సందేహాలు నివృత్తి చేస్తారు.సభ్యులు ఇంటి వద్దనే ఉంటూ బ్యాంకు ఖాతాకు నగదు చెల్లించేలా సన్నద్ధం చేస్తారు.

ప్రతి లావాదేవీకి రశీదు

స్వశక్తి మహిళలు ఇప్పటి వరకు బ్యాంకు లావాదేవీల సమయంలో రశీదులు తీసుకోవడం లేదు. నమ్మకంతో పొదుపు రుణ కిస్తులు చెల్లిస్తున్నా ఏదో ఒక చోట మోసాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితికి తావు లేకుండా డిజిటల్ బ్యాంకింగ్ విధానం ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి సభ్యురాలూ నగదు రహిత లావాదేవీలు నిర్వహించేలా అవగాహన కల్పిస్తాం. రవికుమార్, అదనపు ప్రాజెక్టు అధికారి, సెర్ప్

## మరోసారి ముంపు ముప్పు!

ఖమ్మం: వర్షాకాలం సమీపిస్తుండటంతో ఖమ్మం జిల్లాలోని నగరపాలిక, పురపాలికల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏటా వానాకాలంలో భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమయ్యే లోతట్టు ప్రాంతాలకు ఈసారీ ముంపు ముప్పు తప్పేలా లేదు. ముందస్తు సన్నద్ధత చర్యల్లో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు 100 రోజుల ప్రణాళిక రూపొందించామని అధికారులు చెబుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులకు పూనుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఖమ్మంలో కన్నీరు‘మున్నేరు’..**

ఖమ్మం నగరంలో మున్నేరు పరీవాహక కాలనీలు సారథినగర్, మంచికంటినగర్, వెంకటేశ్వరకాలనీ, పద్మావతినగర్, కాలొడ్డు, బొక్కలగడ్డ, మోతీనగర్ గతేడాది జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. రామన్నపేట, దానవాయిగూడెం కాలనీలకు ఏటా వరద ముప్పు తప్పటం లేదు. వరద కష్టాలకు చెక్ పెట్టేందుకు మున్నేరుకు రెండువైపులా చేపట్టిన కరకట్టల నిర్మాణ పనులు కొనసా..గుతున్నాయి. నిజాంపేట, చెరువుబజార్, వరదయ్యనగర్‌తోపాటు నగరంలోని ప్రధాన రహదారుల వెంట మురుగునీటి వ్యవస్థ సక్రమంగా లేదు. కాల్వలు పొంగి వర్షం నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. మురుగుకాల్వల ఆక్రమణలతో పరిస్థితి మరింత దిగజారింది. ఈసారి వరద తీవ్రతను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని కమిషనర్ అభిషేక్ అగస్త్య చెబుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేకాధికారులను నియమించి.. స్థానికంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం చేరవేస్తామని తెలిపారు. వర్షాకాలం సన్నద్ధత, సహాయక చర్యలపై 100 రోజుల ప్రణాళికను జూన్ 2 నుంచి అమలుచేస్తామన్నారు.

**మధిరలో మారని తీరు**

మధిర అంబారిపేట పెద్దచెరువుకు రాతి కరకట్ట లేకపోవటం వల్ల ఏటా వానాకాలంలో వరదరాఘవాపురం, హనుమాన్‌కాలనీ, ముస్లింకాలనీకి వరదనీరు పోటెత్తుతుంది. మట్టి కట్ట స్థానంలో కిలోమీటరు మేర రాతికట్ట నిర్మిస్తేనే ముంపు సమస్యకు కొంత అడ్డుకట్ట వేయొచ్చు. బంజారాకాలనీ, లడక్‌బజార్‌లో వరద కాల్వ ఆక్రమణకు గురవటం వల్ల చిన్నపాటి వర్షానికే ఇళ్లల్లోకి, రహదారులపైకి భారీగా వరద నీరు చేరుతుంది.

కరకట్ట నిర్మాణం కలేనా? వైరా

నల్లచెరువు వాగు నిండి ఏటా ఇందిరమ్మ కాలనీ ముంపునకు గురవుతోంది. సుమారు 200 ఇళ్లల్లోకి వరద చేరుతోంది. ఇక్కడ ముంపు నివారణకు కరకట్ట నిర్మించాలనే డిమాండ్ 15ఏళ్లుగా అమలుకు నోచుకోవటం లేదు. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటే సమీపంలోని రాజీవ్‌కాలనీకి వరద పోటెత్తుతుంది. ఏటా తూతూమంత్రంగా రక్షణ చర్యలు చేపడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. సత్రంబజార్, శాంతినగర్, సంతబజార్‌లు ఏటా వరద గుప్పిట్లో చిక్కుకుంటాయి. మురుగునీటి వ్యవస్థను పటిష్ఠపరిస్తేనే ముంపు ముప్పు తొలగుతుందని స్థానికులు చెబుతున్నారు.

మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం

సత్తుపల్లిరాజీవ్‌కాలనీ, ఎన్టీఆర్‌నగర్‌ను ఏటా వరదనీరు ముంచెత్తుతుంది. శివారు ప్రాంతాలను ఆనుకుని ఉన్న మురుగుకాల్వలు పొంగి ఇళ్లల్లోకి వరద నీరు చేరుతుంది. మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిస్తేనే ముంపు ముప్పును తప్పించవచ్చు.






హైదరాబాద్ : తెలంగాణలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షల ఫలితాలను అధికారులు శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేశారు. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 42,832 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 38,741 మంది హాజరయ్యారు. ఈ పరీక్షల్లో 24,415మంది (73.35 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేసి ఫలితాలు పొందొచ్చు.

# పార్ట్ టైమ్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం భారీ శుభవార్త

హైదరాబాద్ : ప్రస్తుతం తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్స్ పెరిగిపోతున్నారు. పార్ట్ టైమ్ ఉద్యోగాలు అధికం అవుతున్నాయి. స్విగ్గీ, జొమాటో, జెప్టో దగ్గర్నుంచి ర్యాపిడో,ఓలా,ఉబర్ ఇలా ప్రతి రంగంలో పార్ట్ టైమ్ ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో కనిపిస్తున్నారు. తక్కువ సమయం ఎక్కువ డబ్బు అన్న కాన్సెప్ట్ కారణంగా యువత ప్రభుత్వ ఉద్యోగాలు, సాఫ్ట్ వేర్ కంపెనీలకు వెళ్లకుండా పార్ట్ టైమ్ ఉద్యోగాలకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. రోజులో ఓ పూట పార్ట్ టైమ్ ఉద్యోగం చేసి.. మరో పూట వారి చదువులు, కోచింగ్స్, ఇతర ఆటలు, ఇష్టమైన పనులు చేసుకుంటున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్ల సంఖ్య పెరిగిపోతోంది. నీతి ఆయోగ్ డేటా ప్రకారం 2020లో దేశంలో 70 నుంచి 80 లక్షల మంది గిగ్ వర్కర్లు ఉండగా.. 2029-30 నాటికి ఆ సంఖ్య 2 కోట్లు దాటనుందని ప్రముఖ సంస్థల సర్వేల ద్వారా వెల్లడవుతోంది. ఇక ప్రస్తుతం తెలంగాణలో 4.5 లక్షల మంది గిగ్ వర్కర్లు ఉన్నట్లు సమాచారం. అయితే గిగ్ వర్కర్ల సంక్షేమం, భద్రత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలోనే గిగ్ వర్కర్ల కోసం ఓ బోర్డును ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తుందని కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి తెలిపారు. ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ పార్టీ యువతకు హామీ ఇచ్చిందని.. త్వరలోనే గిగ్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివేక్ వెంకట స్వామి గుడ్ న్యూస్ చెప్పారు. ఎన్నికల ముందు వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త చట్టం తెస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని ఆయన గుర్తుచేశారు. ఇప్పటికే రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లోని గిగ్ వర్కర్లకు ప్రత్యేకంగా ఓ చట్టాన్ని రూపొందించారని మంత్రి వివేక్ గుర్తు చేశారు. రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగా త్వరలోనే తెలంగాణలోనూ గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకురానున్నట్లు రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి తెలిపారు. ఈ మేరకు పార్ట్ టైమ్ ఉద్యోగుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం తొలి అడుగు వేయబోతోందని తెలిపారు. గిగ్ వర్కర్లకు సంబంధించిన కొత్త చట్టాన్ని కేబినెట్ ముందుకు తీసుకురాబోతున్నామని పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల బిల్లు రాష్ట్ర మంత్రివర్గంలో ఆమోదం పొందాక అసెంబ్లీలో ఈ బిల్లును ప్రవేశపెడతామని మంత్రి వివేక్ స్పష్టం చేశారు. దీంతో తెలంగాణలోని 4.5 లక్షల మంది గిగ్ వర్కర్లకు లబ్ధి చేకూరుతుందని వివరించారు.

# ఫోన్ ట్యాపింగ్.. రోజుకొకరి విచారణ.. ఇదేమన్న డైలీ సీరియలా: ఎంపీ రఘునందన్



హైదరాబాద్, జూన్ 27: దుబ్బాక ఉప ఎన్నికలతోనే ఫోన్ ట్యాపింగ్ ప్రారంభమైందని.. మొట్ట మొదటిసారిగా తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని డీజీపీకి అనేక సార్లు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధంలేని కాంగ్రెస్ నాయకులను సిట్ పిలుస్తోందని.. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ అయ్యింది తనదన్నారు. మమ్మల్ని అడిగితే అన్ని వివరాలు ఇచ్చే వాళ్ళమన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో గాడిద గుడ్డు తప్ప చర్యలు ఉండవని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మూలాఖత్ అయ్యాయని విమర్శించారు. ఫిర్యాదు చేసిన తమను సిట్ ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు. రోజుకు ఒక్కరిని మాత్రమే విచారణ చేయడానికి ఇదేమైనా డైలీ సీరియలా అని ప్రశ్నించారు. ఆధారాలు ఇచ్చే వాళ్లను పక్కన పెట్టి డైలీ సీరియల్ నడుపుతున్నారని విమర్శలు గుప్పించారు.

**కాంగ్రెస్‌పై విమర్శలు...** కాంగ్రెస్ పార్టీకి ప్రచార ఆర్భాటాలు తప్ప మరొక్కటి లేదని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. బెదిరింపు కాల్స్‌పై విచారణ జరుగుతుందని పోలీస్ ఉన్నతాధికారులు చెప్పారని తెలిపారు. నియోజకవర్గానికి వెళ్లినప్పుడు సమాచారం ఇస్తే ఎస్కార్ట్, ముగ్గురు సిబ్బందిని ఇస్తామన్నారన్నారు. కాంగ్రెస్ 18 మాసాల పాలనపై సమీక్షించుకోకుండా రోజుకొక కొత్త కథతో ముందుకు వస్తోందని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ మేయర్ ఐదు రూపాయల భోజనం పేరు మారుస్తున్నట్లు ప్రకటించారని.. అన్నపూర్ణ క్యాంటీన్ పేర్లను ఇందిరమ్మ పేరు పెట్టడం దౌర్భాగ్యమన్నారు. ఇందిరమ్మ పేరు చెబితే ఎమర్జెన్సీ గుర్తుకు వస్తుందనే ఇంగిత జ్ఞానం లేకుండా ఇందిరమ్మ పేరు పెడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. మేయర్ దృష్టి పెట్టాల్సింది కుక్కల బెడద, సమస్యలపైన కానీ పేర్ల మార్పు మీద కాదు అంటూ హితవుపలికారు. పథకాల పేర్లు మార్చడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు తప్పితే ఇళ్లు లేని వాళ్లకు ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలకు సవాల్ విసురుతున్న.. ఇళ్లులేని వాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని నిరూపించాలన్నారు. రేవంత్ రెడ్డి నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామానికైనా వెళ్లి పరిశీలించాలన్నారు. 'కవిత ఎవ్వరూ.. కవిత బీసీనా. అధికారంలో ఉన్న పదేళ్లు ఎందుకు బీసీలు గుర్తుకురాలేదు. బీసీలకు అధ్యక్ష పదవి, ఎల్పీనేత పదవులు ఇవ్వకుండా బీసీ ఉద్యమం చేస్తామంటే ఎట్లా? మతపరమైన రిజర్వేషన్లు తొలగిస్తే.. రాజ్యాంగ సవరణ చేస్తాం' అని ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు.




హైదరాబాద్: అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు చేసిన భూ కేటాయింపులను హైకోర్టు రద్దు చేసింది. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని సర్వే నెంబరు 83/1లో 3.5 ఎకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ జారీ చేసిన జీఓను హైకోర్టు కొట్టేసింది. ఐఏఎంసీకి భూమిని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ రెండు వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. న్యాయవాది కె.రఘునాథ్‌రావు, వెంకటరామ్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్లపై జనవరిలో వాదనలు ముగిశాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ సంస్థకు భూకేటాయింపు చేశారని న్యాయవాది రఘునాథ్ రావు కోర్టుకు తెలిపారు. ఐటీ కారిడార్‌లో రూ.350 కోట్ల విలువ చేసే భూమిని సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా కేటాయించారని వాదించారు. అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తే పలు అంతర్జాతీయ సంస్థల మధ్య వివాదాల పరిష్కారానికి దోహదపడుతుందని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. వివాదాలు కేవలం న్యాయస్థానాల్లోనే కాకుండా.. బయట కూడా పరిష్కరించుకోవచ్చని న్యాయస్థానాలే చెబుతున్నాయన్నారు. ఐఏఎంసీ వల్ల వివాదాలు పరిష్కారమైతే కోర్టులపై కూడా భారం తగ్గుతుందన్నారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో జనవరిలో తీర్పును రిజర్వు చేసిన హైకోర్టు శుక్రవారం వెలువరించింది. ఐఏఎంసీ భూకేటాయింపుతో పాటు, ప్రస్తుత భవనం నిర్వహణ కోసం జారీ చేసిన జీఓలను కూడా హైకోర్టు కొట్టేసింది.

# మావోయిస్టుల లేఖపై స్పందించిన మంత్రి సీతక్క



ములుగు, జూన్ 27: ఆదివాసీల వ్యవహారంలో మావోయిస్టులు తనకు సంధించిన లేఖపై తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క స్పందించారు. తన మూలాలను తానెప్పుడు మరిచి పోలేదన్నారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగులో మంత్రి సీతక్క విలేకర్లతో మాట్లాడుతూ.. జీవో 49ను తాను వ్యతిరేకించానని గుర్తు చేశారు. మంత్రిగా ఉండి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టానని వివరించారు. ఆ క్రమంలో ఆదివాసీల జోలికి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖతోపాటు తానూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోద్భలంతో ఒకరిద్దరు అటవీశాఖ అధికారులు తప్పా.. ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదని మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. అయితే ఎవరు మాట్లాడినా నిజాలు మాట్లాడాలంటూ మావోయిస్టులకు ఆమె పరోక్షంగా సూచించారు. ఆదివాసీల వ్యవహారంపై ఇవాళ(శుక్రవారం) ఉదయం మంత్రి సీతక్కకు మావోయిస్టులు లేఖ రాశారు. ఈ లేఖలో వారు ఏమన్నారంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా పని చేస్తున్న మాజీ మావోయిస్టు సీతక్క.. ఆదివాసీల హక్కుల గురించి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కులకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్కదేనని స్పష్టం చేశారు.

జీవో నెంబర్ 49తో కుమురం భీమ్ జిల్లాలోని 339 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ఈ జీవో 49 కారణంగా రాష్ట్రంలో మూడు జిల్లాలు కనుమరుగవుతున్నా యంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే జీవో నెం. 49 తీసుకువచ్చారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఈ లేఖపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి వివరణ ఇచ్చారు.

# బేసిన్‌కు బాసిన్‌కు తేడా తెలియని సీఎం రేవంత్.. హరీష్ ఎద్దేవా



హైదరాబాద్, జూన్ 27: బనకచర్లపై పీపీటీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఏబీఎన్ - ఆంధ్రజ్యోతితో మాజీ మంత్రి మాట్లాడుతూ.. డైవర్షన్ కోసమే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారని మండిపడ్డారు. 2016 ఎజెండా మినిట్స్‌పై రేవంత్ రెడ్డితో చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని.. తెలంగాణకు ఆమోదయోగ్యం లేకుంటే ఒప్పుకునేది లేదని 2016 మీటింగ్‌లో ఆయన చెప్పారని గుర్తుచేశారు. బనకచర్లపై కేంద్ర జలశక్తి మీటింగ్‌లో ప్రభుత్వం తెలంగాణ వాదనను గట్టిగా వినిపించాలని డిమాండ్ చేశారు. విషయం లేకనే.. సీఎం రేవంత్ రెడ్డి బూతులు ఎత్తుకున్నారని వ్యాఖ్యలు చేశారు. బేసిన్‌కు బాసిన్‌కు తేడా తెలియని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ఎంపీల మీటింగ్ ఏర్పాటు చేశారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బనకచర్ల కార్పొరేషన్ ఏర్పడలేదని, టెండర్లు పిలువలేదని చెప్పుకొచ్చారు. చేతులు కాలినాక.. ఆకులు పట్టుకున్న చందంగా బీజేపీ తీరుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు నష్టం జరగకముందే బనకచర్లను ఆపేలా.. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బనకచర్లపై రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు.

# కృష్ణా బోర్డు ప్రత్యేక సమావేశం.. ప్రత్యేక ఇన్సెంటివ్‌లపై చర్చ



హైదరాబాద్: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం ముగిసింది. బోర్డు చైర్మన్ అతుల్‌జైన్ అధ్యక్షతన హైబ్రిడ్ విధానంలో ఈ సమావేశం నిర్వహించారు. ఢిల్లీ నుంచి అతుల్ జైన్, తెలంగాణ, ఏపీ అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

కృష్ణా బోర్డు లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్, కేంద్ర జలశక్తి శాఖ మార్గదర్శకాలు, హైకోర్టు ఆదేశాలపై చర్చించారు. ప్రత్యేక ఇన్సెంటివ్‌లు ఇవ్వరాదని, ఉద్యోగుల నుంచి రికవరీ చేయరాదని నిర్ణయించారు.

# హైదరాబాద్‌లో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర



హైదరాబాద్: భాగ్యనగరంలో జగన్నాథుడి రథయాత్ర ఘనంగా కొనసాగుతోంది. ఇస్కాన్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్, లోయర్ ట్యాంక్ బండ్ వద్దనున్న ఇస్కాన్ మందిరాల నుంచి వేర్వేరుగా ఈ కార్యక్రమాలు కొనసాగాయి. నగరవాసులు భారీగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సికింద్రాబాద్ ఇస్కాన్ టెంపుల్ నుంచి బయల్దేరిన రథయాత్ర మోండామార్కెట్ నుంచి వెళ్తుండగా.. మహిళలు అందమైన రంగవల్లులు వేసి జగన్నాథుడికి స్వాగతం పలికారు.

# జాన్‌పహాడ్ లిఫ్ట్ ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్



హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లాలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పర్యటించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.302 కోట్లతో నిర్మిస్తున్న జాన్‌పహాడ్ లిఫ్ట్ ప్రాజెక్టు పనుల గురించి ఆరా తీశారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**హుస్నాబాద్‌లో నలుగురు మంత్రుల పర్యటన..** మరోవైపు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నలుగురు మంత్రులు పర్యటించారు.

తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్ కలిసి ఇక్కడ మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.




# సీఎం కాన్వాయ్‌లోని 19 కార్లు ఒకేసారి బ్రేక్‌డౌన్.. ఎందుకంటే

భోపాల్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌కు మార్గమధ్యంలో అనూహ్యమైన ఇబ్బందులు తలెత్తాయి. దీంతో కాన్వాయ్‌లోని 19 వాహనాలు ఒకదాని వెంట మరొకటి రోడ్డుపైనే నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి షెడ్యూల్ ప్రకారం రత్లాంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి శుక్రవారంనాడు బయలుదేరారు. కొంతదూరం వెళ్లాక 19 ఎస్‌యూవీలతో కూడిన కాన్వాయ్‌లో సమస్యలు తలెత్తాయి. వాహనాలు జర్కులు ఇస్తూ నిలిచిపోయాయి. వాహనాలను నెట్టే ప్రయత్నం చేసినప్పటికీ అవి స్టార్ట్ కాలేదు. దీంతో మరో ప్రత్యేక వాహనంలో సీఎం ముందుకు సాగారు. సీఎం కాన్వాయ్‌లోని వాహనాలు రోడ్డుపైనే మొరాయించడానికి స్థానిక పెట్రోల్ పంప్‌లో డీజిల్ కల్తీ కావడమే కారణంగా అధికారులు అనుమానిస్తున్నారు. తొలుత ఒకటి, రెండు కార్లలో సమస్య తలెత్తినా ఆ తర్వాత అన్ని వాహనాలు నిలిచిపోయినట్టు కాన్వాయ్ డ్రైవరు శుభం వర్మ తెలిపారు. స్థానిక పెట్రోల్ పంప్‌లో 350 లీటర్ల డీజిల్ నింపామని, అయితే కల్తీకి అవకాశమే లేదని సిబ్బంది చెబుతున్నారని పేర్కొన్నారు. కాగా, స్థానిక యువకుడు ఒకరు ఇదే పెట్రోల్ పంప్ నుంచి నింపుకున్న డీజిల్‌లో వాటర్ లేయర్లు కనిపించడంతో డీజిల్ శాంపుల్స్ సేకరించిన ఫుడ్ అండ్ సివిల్ సప్లై అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టారు. ఆ శాంపుల్స్‌లో నీళ్లు కలిసినట్టు గుర్తించారు. దీనిపై మరింత విచారణ జరిపి సమగ్ర నివేదికను రత్లాం కలెక్టర్‌కు అందజేస్తామని ఫుడ్ డిపార్ట్‌మెంట్ అధికారి ఆనంద్ గోలే తెలిపారు. ప్రస్తుతం పెట్రోల్ పంప్‌ను అధికారులు సీజ్ చేశారు.

## సీరియస్ మేటర్... 'భార్యభర్తల మధ్య ట్రంప్ మధ్యవర్తిత్వం వహించరు'!

ప్రధాన అంతర్జాతీయ సంఘర్షణలకు, యుద్ధాలకు తాను మధ్యవర్తిత్వం వహిస్తున్నానని, ముందుముందు వహిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెబుతున్న సంగతి తెలిసిందే. అయితే.. సమస్యను తెరవెనుక మీరే సృష్టించి, తెరముందు మీరే ముగించి, మీకుమీరే చప్పట్లు కొట్టుకుంటున్నారనే కామెంట్లు సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పై వినిపిస్తుంటాయి.. అది వేరే విషయం! ఈ క్రమంలో... భారత్ - పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం విషయంలో అమెరికా పాత్ర లేదని, ట్రంప్ ప్రమేయం లేదని ప్రధాని నరేంద్ర మోడీ పబ్లిక్ గా చెప్పినా... ఆ ఇరు దేశాల మధ్య యుద్ధం.. కాదు కాదు.. అణుయుద్ధం జరగకుండా తానే ఆపానని ట్రంప్ పదే పదే చెప్పుకుంటున్నారు. ఇటీవల మోడీ వ్యాఖ్యలతో ఏకీభవించినట్లే ఏకీభవించి.. మళ్లీ మొదటికొచ్చారు. ఇందులో భాగంగా... తాను వరుస ఫోన్ కాల్స్ తో యుద్ధం ముగించానని.. మీరు ఒకరితో ఒకరు పోరాడితే తాము ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకోమని భారత్, పాక్ లకు తేల్చిచెప్పానని అన్నారు. అనంతరం మోడీ తనకు గొప్ప స్నేహితుడని.. పాక్ జనరల్




ఆకట్టుకునే వ్యక్తి అని చెప్పిన ట్రంప్.. వారు కూడా వాణిజ్య ఒప్పందమే కావాలని చెప్పారని పేర్కొన్నారు. ఇక తాజాగా ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించడంలో తాను కీలక పాత్ర పోషించానని ట్రంప్ పేర్కొన్నారు. వ్యక్తిగత దౌత్యం, బలమైన ఆర్థిక పరపతి తన విజయాలకు కారణమని ఆయన చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా మీమ్స్, ట్రోల్స్ హల్ చల్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓ పోస్ట్ వైరల్ గా మారింది. అవును... ప్రపంచంలో ఎక్కడ ఏ సంఘర్షణ వచ్చినా దాన్ని తానే ఆపుతున్నానని, తాను 21వ శతాబ్దపు శాంతి దూతనని, ఇంత చేసినా తనకు నోబెల్ శాంతి బహుమతి రాదని సన్నాయినొక్కులు నొక్కుతూ వైరాగ్యపు మాటలు మాట్లాడుతున్న ట్రంప్... భార్యభర్తల గొడవల్లో మాత్రం మధ్యవర్తిత్వం చేయరంట. ఇది అయన చెప్పలేదు.. మీమ్స్ చెబుతున్నాయి! ఇందులో భాగంగా... "వివాహిత జంటల మధ్య వైవాహిక వివాదాలను పరిష్కరించమని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ కు ఫ్రాంక్ కాల్స్ వస్తున్నట్లు చూపిస్తుంది. దీంతో... కాస్త కోపంగా మారిన ట్రంప్... "నా నంబర్ మీకు ఎవరు ఇచ్చారు?.. నేను భార్యాభర్తల మధ్య మధ్యవర్తిత్వం వహించను!" అని అన్నారు! దీంతో ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ మీమ్ వైరల్ గా మారింది.

## నిద్రపోవడానికి బయపడుతోన్న కొత్త పెళ్లికొడుకు.. షాకింగ్ రీజన్!



కొంతకాలం క్రితం భార్యల టార్చర్ తట్టుకోలేక వీడియోలు తీసుకుంటూ, నోట్స్ రాస్తూ ఆత్మహత్యలు చేసుకున్న భర్తల సంఘటనలు తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా భార్యల చేతుల్లో హత్యకు గురవుతున్న భర్తల విషయాలు షాకింగ్ గా మారుతున్నాయి! ఈ క్రమంలో తాజాగా.. రాత్రులు కాసేపు నిద్రపోదామంటేనే భయమేస్తోందని అంటున్న ఓ కొత్త పెళ్లికొడుకు వ్యవహారం సంచలనంగా మారింది. అవును... ఇటీవల మధ్యప్రదేశ్ లోని ఇండోర్ కు చెందిన రఘువంశీ అనే కొత్త పెళ్లికొడుకు.. మేఘాలయాలో హనీమూన్ కోసం వెళ్లి ఘోరంగా హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. తవ్వేకొద్దీ ఒక్కో షాకింగ్ విషయం ఆ ఉదంతంలో వెలుగుచూసింది! స్వయంగా భార్యే తన ప్రియుడి సపోర్ట్ తీసుకుని సుపారీ కిల్లర్లను పెట్టి భర్తను చంపించడం తీవ్ర కలకలం సృష్టించింది. ఆ ఘటన గురించి మరిచిపోకముందే... తాజాగా తెలంగాణలోని గద్వాల జిల్లాలోనూ తేజేశ్వర్ అనే సర్వేయర్ ను అతడి భార్య ఇదే రీతిలో చంపించిన ఘటన తెరపైకి వచ్చింది. ఆ ఘటనలోనూ అత్యంత దారుణమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇల వరుస ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో... రఘువంశీ తరహాలోనే ప్రమాదంలో పడబోయి జస్ట్ మిస్ అయినట్లు చెబుతున్నారు మరో కొత్త పెళ్లికొడుకు. వివరాల్లోకి వెళ్తే... ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ కు చెందిన నిషాద్ అనే వ్యక్తికి ఇటీవల సితార అనే యువతితో వివాహమైంది. ఆ వివాహ వేడుకలో ఎంతో సంతోషంగా ఉన్నట్లు కనిపించిన ఆమె... మొదటి రాత్రి మాత్రం వింతగా.. కాదు కాదు.. భయంకరంగా ప్రవర్తించింది. ఇందులో భాగంగా.. ఏకంగా కత్తి తీసుకుని గదిలోకి వెళ్లింది. 'నన్ను తాకితే.. 35 ముక్కలు చేస్తా' అంటూ మొదటిరాత్రి గదిలో భర్తను బెదిరించింది. ఆ సందర్భంగానే తన ప్రేమ వ్యవహారం గురించి చెప్పింది! అమన్ అనే వ్యక్తిని తాను ప్రేమించానని, తనతోనే వెళ్లిపోతానని, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని ఆమె బెదిరించిందట. ఈ క్రమంలో మొదటి మూడు రోజులు తన ఇంట్లో ఉండి, ఒక రోజు అర్ధరాత్రి గోడ దూకి ప్రేమికుడితో సితార పారిపోయిందని నిషాద్ ఒక వీడియో ద్వారా వెల్లడించారు. ఈ సమయంలోనే ఓ షాకింగ్ విషయం వెల్లడించారు. ఇందులో భాగంగా... సితార తనను కేదార్ నాథ్ యాత్రకు తీసుకెళ్లమని అడిగిందని, అయితే.. ఇటీవల జరిగిన రఘువంశి హత్య గుర్తొచ్చి ఆగిపోయాయని నిషాద్ తెలిపాడు. ఒకవేళ వెళ్లి ఉంటే.. తన పరిస్థితి కూడా అలానే ముగిసి ఉండేదని అన్నాడు! తనతో సితార ఉండగా.. ఎక్కడ తనను చంపేస్తుందో అని సరిగా నిద్ర కూడా పోలేదని చెప్పుకుంటున్నాడు. అసలు పెళ్లి అనే మాట వింటేనే గుండెల్లో దడ పుడుతోందని అతను వ్యాఖ్యానించాడు. దీంతో... గత కొంతకాలంగా వరుసగా జరుగుతున్న ఈ భయానక ఘటనలు చూసి కుర్రాళ్లు పెళ్లి చేసుకోవాలంటేనే భయపడుతున్నారనే కామెంట్లు వినిపిస్తున్నాయి. వివాహ సమయంలో.. వరుడు, వధువు.. ఎవరికి ఏమాత్రం ఆ వివాహం ఇష్టం లేకపోయినా ఏమాత్రం భయపడకుండా తల్లితండ్రులకు చెప్పాలని, పేరెంట్స్ కూడా వారి పరిస్థితిని అర్థం చేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. అలా కాకుండా తల్లితండ్రులు పంతాలకు పట్టింపులకు కులాలు మతాల ఆలోచనలకు పోతే.. ఇలాంటి ఘటనలు ఇంకా ఎన్నో చూడాల్సి వచ్చే అవకాశం లేకపోలేదని అంటున్నారు!

## అమెరికాతో అణు చర్చలపై ఇరాన్ క్లారిటీ.. మేటర్ మళ్లీ మొదటికి!

అణుచర్చలకు ఒప్పించడం కోసం ట్రంప్ పలు ప్రయత్నాలే చేశారని చెప్పొచ్చు. ఇందులో భాగంగా తొలుత మాటలతో చెప్పారు.. సుమారు ఐదు దశల్లో చర్చలు జరిపారు.. అయినా ఫలితం రాలేదని అంటారు! కట్ చేస్తే... ఇజ్రాయెల్ ని పంపించి, అనంతరం తాను ఎంట్రీ ఇచ్చి చేయాల్సిన డ్యామేజ్ చేశారు. ఇప్పుడు మరోసారి చర్చల ప్రస్తావన తెచ్చారు. ఈ సమయంలో ఇరాన్ స్పందించింది. అవును... అడిగితే పని అవ్వకపోవడంతో, అణుకేంద్రాలను ధ్వంసం చేశారు ట్రంప్! తానేమిటో చూపించాను కాబట్టి ఇక ఇరాన్ చర్చలకు ముందుకు వస్తుందనే ఆశతో ఉన్నారని అంటారు. ఈ సమయంలో ఇరాన్ స్పందించింది. ఇందులో భాగంగా... అమెరికాతో ఎలాంటి అణుచర్చలు జరిపే ఉద్దేశం తమకు లేదని పేర్కొంది. దీంతో... అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ నెక్స్ట్ స్టెప్ ఏమిటనేది ఆసక్తిగా మారింది. ఇటీవల ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా స్పందించిన ట్రంప్... వచ్చేవారం టెహ్రాన్ తో అణుచర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు. అయితే, తాజాగా ఈ విషయంపై స్పందించిన ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ.. అణుచర్చలపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చారు. ఈ విషయంలో అమెరికాతో సమావేశమయ్యే ఆలోచన తమకు లేదని




ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్పందించిన అబ్బాస్ అరాగ్చీ... ఇటీవల తమపై జరిగిన దాడులు గణనీయమైన నష్టాన్ని కలిగించాయని అన్నారు. ఇదే సమయంలో... ఇరాన్ అణు కార్యక్రమం పునరుద్ధరణపై అధికారులు అధ్యయనం చేస్తున్నారని వెల్లడించారు. దీంతో.. ఈ విషయం ఆసక్తిగా మారింది. ఇదే సమయంలో వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ స్పందించారు. ఇందులో భాగంగా... ప్రస్తుతానికి చర్చల టాపిక్ వంటిది ఏమీ లేదని అన్నారు. అయితే, అణు ఒప్పందానికి సంబంధించిన చర్చలు తిరిగి ప్రారంభించేందుకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్ తో మాట్లాడుతున్నామని తెలిపారు. దీంతో... ఇరాన్ ఈ విషయంలో తగ్గకపోవచ్చని.. తిరిగి అణు కార్యక్రమం పునరుద్ధరణపై సీరియస్ గా దృష్టి సారించొచ్చని చెబుతున్నారు. కాగా... ఇటీవల జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశంలో మాట్లాడిన ట్రంప్.. వచ్చేవారం టెహ్రాన్ తో అణుచర్చలు జరుపుతామని, ఈ చర్చలద్వారా అణ్వాయుధాలు తయారుచేయాలన్న ఆశయాన్ని వదిలేసేలా ఇరాన్ తో ఒప్పందం చేసుకొనే అవకాశం ఉందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే.. అలాంటి ఉద్దేశ్యం తమకు లేదని ఇరాన్ తాజాగా పేర్కొంది.

సినిమా 'షో'


## అప్పటికీ ఇప్పటికీ అమ్మడు అదే డిమాండ్..!

వారానికో సినిమా రిలీజ్ అవుతుంది. అందులో నటించేందుకు హీరోయిన్స్ వస్తున్నారు. కానీ వారిలో సక్సెస్ అయ్యే హీరోయిన్స్ మాత్రం చాలా తక్కువ. అలాంటి పరిశ్రమలో తమకంటూ ఒక స్టార్ స్టేటస్ తెచ్చుకుని మెప్పించడం అంటే మామూలు విషయం కాదు. అంతేకాదు ఆ స్టార్ డం ని దశాబ్దాలుగా కొనసాగించడం మరీ కష్టం. అలా స్టార్స్ కి ఏమాత్రం తగ్గని విధంగా తన సత్తా చాటుతూ హీరోయిన్స్ లో చాలా ప్రత్యేకంగా ఉంటుంది కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార. ఓ పక్క కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే మరోపక్క ఫిమేల్ సెంట్రిక్ సినిమాలతో అదరగొట్టేస్తుంది. కోలీవుడ్ లో ఒకదశలో నయనతార సినిమా వస్తుంది అంటే స్టార్ హీరోలు కూడా భయపడే పరిస్థితి వచ్చింది. ఐతే తమిళ్ తో పాటు తెలుగులో కూడా నయనతార సినిమాలు చేస్తూ వచ్చింది. తెలుగులో స్టార్ హీరోలతో నటిస్తూ అదరగొట్టేస్తుంది. ఐతే కొన్నాళ్లుగా తమిళ



సినిమాలకే పరిమితమైంది నయనతార. ఈమధ్యనే బాలీవుడ్ లో కూడా తన మార్క్ చూపించే ప్రయత్నం చేసింది. షారుఖ్ ఖాన్ జవాన్ లో నటించి బీ టౌన్ ఆడియన్స్ ని మెప్పించింది నయనతార. ఇక ఈమధ్యలోనే ఒక తెలుగు సినిమా కోసం నయనతారని కలిశారట మేకర్స్. అనిల్ రావిపూడి డైరెక్షన్ లో చిరంజీవి చేస్తున్న సినిమాలో హీరోయిన్ గా నయన్ ని తీసుకునే ప్లాన్ లో ఉన్నారట. చిరుతో ఆల్రెడీ సైరా నరసింహా రెడ్డి, గాడ్ ఫాదర్ సినిమాల్లో నటించింది నయనతార. ఇప్పుడు అనిల్ తో చేసే సినిమాలో కూడా నయన్ నటిస్తుందని టాక్. ఐతే ఈ సినిమాలో నటించేందుకు గాను అమ్మడు 18 కోట్ల దాకా డిమాండ్ చేస్తుందని తెలుస్తుంది. రెమ్యునరేషన్ విషయంలో ఎలాంటి కాంప్రమైజ్ అవ్వని నయన్ అంత ఇస్తేనే సినిమా చేస్తానని అంటుందట. ఐతే నయన్ ఉంటే సినిమాకు మంచి బజ్ వస్తుందని ఆమెతో చర్చిస్తున్నారని తెలుస్తుంది. మెగా మూవీలో నయన్ కన్ఫర్మ్ అయితే తప్పకుండా సినిమాకు ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. చిరుతో నయనతార నటించడం గురించి త్వరలోనే అఫీషియల్ అప్డేట్ వస్తుంది. ఈ సినిమాను 2026 సంక్రాంతికి రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. సంక్రాంతికి వస్తున్నాం తో 300 కోట్లు కొట్టిన అనిల్ రావిపూడి డైరెక్షన్ లో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ఈ సినిమా ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

## మరోసారి సెంచరీ కొట్టేసిన ధనుష్




మెల్లగా తన మార్కెట్‌ను బలోపేతం చేసుకుంటున్న తమిళ స్టార్ హీరో ధనుష్‌కు 'కుబేర' సినిమా మరో పెద్ద విజయాన్ని అంధించింది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా, విడుదలైన తొలి రోజు నుంచే మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. నాగార్జున, రష్మిక మందన్నా వంటి స్టార్ కాస్ట్, ధనుష్ ఆకట్టుకునే నటన కలిసి ఈ సినిమాను ప్రత్యేకంగా నిలిపాయి. లేటెస్ట్ గా 'కుబేర' సినిమా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను దాటి గణనీయమైన ఘనత సాధించిందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇది విడుదలైన 6 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం విశేషం. సినిమాపై ముందు నుంచి ఉన్న అంచనాలు, ధనుష్‌కు టాలీవుడ్‌లో ఏర్పడిన క్రేజ్ కారణంగా ఈ విజయాన్ని సాధించినట్టు సినీ విశ్లేషకులు చెబుతున్నారు. 'కుబేర' సినిమా ఒక ధనవంతుడు, ఒక పేదవాడు మధ్య జరిగే సంఘర్షణ నేపథ్యంలో రూపొందింది. ఇందులో ధనుష్ నటించిన దేవా పాత్రకి విశేషంగా స్పందన లభించింది. నాగార్జున నటించిన దీపక్ పాత్ర కూడా ఇంటెన్స్ గా ఉండటంతో ప్రేక్షకులను మరింతగా ఆకట్టుకుంది.

రష్మిక పాత్రకు మంచి సీట్ టైం ఉండగా, కథానాయికగా ఆమె కథను మలుపు తిప్పే పాత్రలో కనిపించగా సినిమా ఎమోషన్‌కి బలాన్నిచ్చింది. సుమారు 3 గంటల నిడివితో తెరకెక్కిన ఈ చిత్రం టెక్నికల్‌గా కూడా ప్రశంసలు అందుకుంది. నేపథ్య సంగీతం, విజువల్స్, ప్రొడక్షన్ వాల్యూస్ అన్ని కూడా హైలైట్‌గా నిలిచాయి. ముఖ్యంగా ధనుష్ నటనలో భిక్షగాడి యాంగిల్‌కి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ హైఎమోషనల్ కమర్షియల్ డ్రామా, టికెట్ల రేట్లు పెరిగినా కూడా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను బాగా ఆకర్షించింది. ఇక ఇటీవల కాలంలో ధనుష్ నటించిన నాలుగు సినిమాలు వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరడం విశేషం. తిరు, సార్, రాయన్, కుబేర ఈ విజయాలతో ధనుష్ తెలుగులో తన స్థాయిని పెంచుకుంటూ పోతున్నారు. ఇక 'కుబేర' వంటి హిట్‌తో ఆయనకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు రావడం ఖాయం అని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక నెక్స్ట్ ఎలాంటి విజయాలు అందుతాయో చూడాలి

## రష్మిక మందన్న రిప్లైకి అర్థం అదేనా?

వెండితెరపై కొన్ని జంటలకున్న క్రేజ్ మరే జంటకూ ఉండదు. కారణం వారిద్దరి మధ్య కనిపించే కెమిస్ట్రీనే. ఆ కెమిస్ట్రీ కారణంగానే ప్రేక్షకులు హిట్ పెయిర్ మళ్లీ మళ్లీ కలిసి నటిస్తే చూడాలని ముచ్చటపడుతుంటారు. ఇప్పుడు అలాంటి ఓ క్రేజీ జోడీ కలిసి నటించే చూడాలని అభిమానులు, సినీలవర్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ జోడీ మరెవరో కాదు రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న. వీరిద్దరు కలిసి 'గీత గోవిందం'లో తొలిసారి నటించారు. వీరి కెమిస్ట్రీ వర్కవుట్ కావడంతో సినిమా వంద కోట్ల క్లబ్‌లో చేరి రికార్డు సృష్టించింది. ఇక ఆ తరువాత కలిసి చేసిన మూవీ 'డియర్ కామ్రేడ్'. ఇది కేవలం రష్మిక కోసమే విజయ్ చేసినట్టుగా ఉంటుంది. 'గీత గోవిందం' అంత కాకపోయినా ఆడియన్స్‌ని మాత్రం విశేషంగా ఆకట్టుకుని ఈ జంటకు హిట్ పెయిర్ అనే ముద్ర వేసింది. 2019లో ఈ మూవీ విడుదలైంది. ఆ తరువాత నుంచి వీరిద్దరు కలిసి మరో సినిమాలో నటించలేదు. మళ్లీ ఇన్నేళ్లకు వీరిద్దరు కలిసి నటించబోతున్నారనే వార్తలు తాజాగా వినిపిస్తున్నాయి. తాజాగా మైత్రీ మూవీమేకర్స్ వారు పెట్టిన ఓ పోస్ట్‌కు రష్మిక రిప్లై ఇవ్వడంతో ఆ వార్తలు నిజమేనని క్లారిటీ వచ్చేసింది. విజయ్ దేవరకొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో రూపొందుతున్న



'కింగ్‌డమ్'లో నటిస్తున్న విషయం తెలిసిందే. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాని ఈ నెల 30న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. దీని తరువాత రాహుల్ సంక్రీత్యన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న పీరియాడిక్ డ్రామాలో నటించనున్నాడు. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మించబోతున్నారు. ఈ భారీ మూవీ వచ్చే నెల హైదరాబాద్‌లో ప్రారంభం కాబోతోంది. ఇందులో విజయ్‌కి జోడీగా రష్మిక నటించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై నిర్మాణ సంస్థ తాజాగా 'వేచి చూద్దాం' అని అర్థం వచ్చేలా ఓ పోస్ట్ పెట్టింది. దానికి రష్మికను ట్యాగ్ చేసింది. దీనికి రష్మిక రిప్లైగా 'ఓకె' అంటూ నవ్వుతున్న ఎమోజీలను పోస్ట్ చేసింది. దీంతో చాలా గ్యాప్ తరువాత రౌడీ, రష్మికల జోడీ ఖరారైందని అభిమానులు భావిస్తున్నారు. రష్మిక ఇదే విషయాన్ని తాజాగా కన్ఫర్మ్ చేసిందని చెబుతున్నారు. ఇదే నిజమైతే మరో సారి క్రేజీ జోడీ స్క్రీన్‌పై సందడి చేయడం ఇక లాంఛనమే.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417